


***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యానబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

# రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే

## చివరి విడత: మలి సందడి (5)

**ఉందిలే మంచి కాలం** ముందుముందున (బెర్లిన్‌లో నేను, నా కుటుంబం)

తెల్లవారింది. జనవరి ఏడు వెళ్లి ఎనిమిది వచ్చింది. మా దాంపత్యంలో విదేశపర్వానికి శుభోదయమది.

మెలకువ వచ్చి కళ్లు తెరిచాను.

ఆశ్చర్యంగా గది పైకప్పుకి కళ్లు, ముక్కు, నోరు ఉన్నట్లు అనిపించింది. ఆ కళ్లు నన్నే మురిపెంగా చూస్తున్నాయి. ఆ నోరు పెదవి విప్పింది. 'నిన్న లేని అందమేదో నిదుర లేచెనెందుకో' అంటూ పాట వినిపించింది. అది ఘంటసాల పాడుతున్నట్లు లేదు. తెలుగు పాటను జర్మన్ యాసలో విన్నట్లుంది.

'అరే, గది పైకప్పు పాట పాడుతోందే' అనుకుని పక్కకు తిరిగాను.

పిల్లలిద్దరూ నిద్ర పోతున్నారు. వాళ్లు ఎంతో అందంగా, కొత్తగా కనిపించారు. వాళ్ల ఉనికి మా మంచానికే అందాన్నిచ్చింది. ఎంతలా అంటే – మా గది పైకప్పు కూడా వాళ్లని చూసే పాడిందా పాట.

'కాకిపిల్ల కాకికే కాదు, కాకి గది పైకప్పుకీ ముద్దే' అనుకున్నాను.

కానీ పాట – నిదుర లేచినవాళ్ల గురించి కదా – పిల్లలింకా నిదుర లేవలేదు కదా – మరి పైకప్పు ఎవర్ని చూసి పాడిందీ అని ఇటు తిరిగితే – శ్రీమతి కనిపించింది. ఎప్పుడు లేచిందో కానీ ఆమె నన్నే చూస్తోంది. నేనేదో అనబోయేలోగా తనే పెదవి కదిపి – "ఇది కల కాదు కదూ!" అంది.

"కలే అయుండాలి. లేకపోతే గది పైకప్పేమిటి? నన్ను చూసి పాట పాడ్డమేమిటి?" అన్నాను.

శ్రీమతి నావంక అయోమయంగా చూసి, "పైకప్పు పాట పాడ్డమేమిటి? మీరిలా అర్థం లేకుండా మాట్లాడుతున్నారంటే ఇది కలే అయుండాలి" అంది.

నేను చటుక్కున ఆమె నోటికి నా చేతిని అడ్డంగా పెట్టి, "మరి మాట్లాడకు బాలా! బాలవాక్కు బ్రహ్మవాక్కు అంటారు. ఈ వాస్తవం కలగా మారిపోయినా మారిపోవచ్చు" అన్నాను.

ఆమె నా చేతిని మృదువుగా తొలగించి, "మనమిప్పుడు సకుటుంబంగా ఒకే గదిలో ఉన్నాం. ఇది నిజం. ఇక ఎప్పటికీ విడిపోం. ఇది కూడా నిజం. ఈ నిజాన్ని అబద్ధం చెయ్యడానికి సాక్షాత్తూ ఆ బ్రహ్మే పూనుకున్నాడని అనుకోండి. అప్పుడీ బాల ఆగ్రహించి శపిస్తుంది. ఒక మహాపతివ్రత శాపానికి గురి కావడం ఆ బ్రహ్మకి కూడా ఇష్టముండదు. తెలిసిందా?" అని, "ఇప్పుడు చెప్పండి. గది పైకప్పు పాట పాడ్డమేమిటి?" అంది.

"ఎందుకింతలా నిలదీస్తున్నావు? ఇప్పుడు నాకెంత సంతోషంగా ఉన్నదంటే – మన చుట్టూ ఉన్న అణువణువు స్పందనలోనూ మధురగానం వినిపిస్తోంది" అని పైకప్పు విషయం చెప్పాను.

శ్రీమతి నిట్టూర్చింది, "విడిగా ఉండడంవల్ల ఇంతకాలం మనకు భావనాప్రపంచమే ఆసరా అయింది. మనమిక ఊహా ప్రపంచంనుంచి బయటపడి వాస్తవాన్ని ఎంజాయ్ చెయ్యాలి" అంది.

నిత్యవిధులే వాస్తవమామెకి. లేచీ లేవగానే స్నానాదులు నిర్వర్తించి – గృహకృత్యాలు నిర్వహించాలి. అందులో భార్య, భర్త, పిల్లలు – వారివారికి నిర్ధారించబడ్డ విధులు, నియమాలు పాటించాలి. వాటిలో కొన్ని మరీ రొటీన్. కొన్ని సరికొత్తవి. 'అన్నిటినీ ఒక్కలా ఎంజాయ్ చెయ్యడమే జీవితం' అంటుందామె.

నిజానికామె చాలా పెద్ద ప్రయాణం చేసి అలసిపోయి ఉంది. రాత్రి కబుర్లలో పడి ఆలస్యంగా పడుకుంది. ఐనా – మేమిక ప్రతి రోజూ కలిసే గడుపుతామన్న ఆలోచనే తనకి సేద తీర్చి విశ్రాంతినిచ్చింది. అందుకేనేమో – నాకంటేనూ పది నిముషాలు ముందే నిద్ర లేచింది.

లేవగానే డ్యూటీలోకి దిగిపోవడం ఆమెకి అలవాటు. కానీ మేమంతా కలిసున్న విషయం – కలో, నిజమో నిర్ధారించుకోలేక కాసేపు అయోమయంలో పడింది. నేను నిద్ర లేచి మాట్లాడగానే – ఆ సందేహం తొలగిపోయింది. ఇక వాస్తవాన్ని ఎంజాయ్ చేసే మూడ్‌లోకి వచ్చింది. అంటే మేమిక పనుల్లోకి దిగాలి. భువనేశ్వర్లో ఐతే – అక్కడ తను ఓ పద్ధతికి అలవాటు పడింది. ఇక్కడ పద్ధతి నేను తనకి అలవాటు చేయాల్సి ఉంది.

"మా ఆఫీసు ఎనిమిదికి. అంటే నేను 7.45కి ఇంట్లో బయల్దేరుతాను. అప్పటికి మన కాలకృత్యాలు, అల్పాహారం ఐపోవాలి. అదీకాక – ఇంటామె ఒలోముచ్‌కీ ఎనిమిదికి నిద్ర లేస్తుంది. తొమ్మిదికీ పదికీ మధ్య బయటకు వెడుతుంది. ఆ మధ్యకాలంలో మనం బాత్రూంనీ, వంటింటినీ ఆమెకి విడిచిపెట్టాలి. తర్వాతనుంచి రాత్రి 9 దాటేదాకా ఇల్లంతా మనదే" అన్నాను.

"మీరు ఆఫీసుకి ఎనిమిదికే వెళ్లిపోవాలంటే, ఆలోగానే టిఫిన్ రెడీ చెయ్యాలంటే...." అంది శ్రీమతి అనుమానంగా.

మామూలుగా ఐతే తను ఉదయం ఎనిమిదికేమిటి – ఆరుకే కావాలన్నా టిఫిన్ సిద్ధం చెయ్యగలదు. కానీ పిల్లలు పుట్టుకొచ్చేక తన ఎఫిషియెన్సీని వాళ్లు నిర్ధారిస్తున్నారు. వాళ్లు ఏడు లోగా నిద్ర లేవరు. బలవంతంగా లేపితే ఏడుస్తారు. ఒకసారి బడిలో వేసేక వాళ్లెలాగూ నిద్రనీ, స్వేచ్ఛనీ కోల్పోక తప్పదు కాబట్టి, అందాకా ఆ విషయంలో మేమూ పట్టించుకోకుండా వాళ్ల ఈ అలవాటుని సాగనిస్తున్నాం.

ఒకసారి పిల్లలు లేచేక ఇంట్లో హడావుడే హడావుడి. ఓపట్టాన బ్రషింగుకి ఒప్పుకోరు. ఒప్పుకున్నాక నేను ముందంటే నేను ముందంటూ పోటీ పడతారు. వాళ్లని లొంగదియ్యడానికి కొన్ని చిట్కాలు వేస్తుంటాను. వాళ్ల బ్రష్షులు తీసుకుని దానిమీద వాళ్లడిగిన బొమ్మ రూపంలో పేస్టు వేస్తానంటాను. అదంతా ఓ పెద్ద తతంగం.

"ఉత్తరాల్లో రాసిందంతా మర్చిపోయావా? ఇప్పుడు ఉదయం మనకి – పాలు, పండు, బ్రెడ్–బటర్–జామ్ అంతే! వాటికి వంటింటి అవసరం లేదు. ఫ్రిజ్‌లోంచి తెచ్చుకుని వాడుకోవడమే. నేనైతే ఎనిమిదిలోగానే అవన్నీ మన గదిలోకి తెచ్చిపెట్టుకునేవాణ్ణి. కానీ – ఒలోముచ్‌కీ ఉన్నా కూడా మనం ఫ్రిజ్‌లోంచి మన సరుకు తెచ్చుకోవచ్చు. వంటింట్లో వాష్‌బేసినూ, హాట్‌ప్లేట్లూ మాత్రం ఆ సమయంలో వాడలేమంతే!" అన్నాను.

శ్రీమతి నన్నదోలా చూసింది. నేను ఇబ్బందిపడి, "ఇల్లు చవగ్గా దొరికిందనుకో. కానీ అద్దె ఎక్కువిచ్చినా కూడా, ఇక్కడ కామన్ కిచెనూ కామన్ టాయిలెట్లూ మామూలే! కారణం ఒకటి – వీళ్లు బెడ్రూంకిచ్చిన ప్రాధాన్యం కిచెన్‌కీ, బాత్రూంకీ ఇవ్వరు. రెండు – కిచెన్‌ని మనకిలా గంటల తరబడి వాడరు" అన్నాను. ఇలాంటి విశేషాలు గతంలో ఉత్తరాల్లో వ్రాసి ఉన్నా ఎందుకైనా మంచిదని ఓసారి గుర్తు చేశాను.

శ్రీమతి నన్నదోలా చూసి, "నా చూపుల్లోని ఆశ్చర్యం మీకు పితూరీలా కనబడిందా?" అంది పాత ఆశ్చర్యానికి కొత్త ఆశ్చర్యాన్ని జోడిస్తూ.

"నేనన్న మాటల్లో ఆశ్చర్యపడాల్సినదేముంది?" అన్నాను నేనూ తనకి దీటుగా ఆశ్చర్యపడుతూ.

"అదా, నాకు తెలిసి మీవరకూ బ్రెడ్డంటే జబ్బుపడ్డవాళ్లు మాత్రమే తినే ఓ వ్యర్థపదార్థం. ఆరోగ్యంగా ఉన్నప్పుడు బ్రెడ్డు మాటెత్తితే అంతెత్తు లేచేవారు. అలాంటి మీరే బ్రెడ్డుని ప్రపోజ్ చెయ్యగానే – కాస్త ఎత్తిపొడవాలనిపించింది. కానీ ప్రస్తుతం మనమధ్య కొత్త మోజొకటి మొదలైందిగా – ఆశ్చర్యంతో సరిపెట్టి ఊరుకున్నాను" అంది శ్రీమతి.

అప్పటికి టైం ఆరుంపావయింది. ఇక త్వరపడి తెమలాలి. అందుకని ఆమె మాటలకి బదులివ్వలేదు.

ముందు ఒకరి తర్వాత ఒకరు బాత్రూంకి వెళ్లి బ్రషింగ్ చేసుకొచ్చాం. అప్పుడు పిల్లల్ని నిద్ర లేపాం.

కొత్త వాతావరణం ప్రభావం కాబోలు – వాళ్లు తొందరగానే లేచారు.

"వసూ! వాళ్లకి బ్రష్షులివ్వు. పేస్టుతో బొమ్మలేస్తాను" అన్నాను.

బాబుకింకా మూడు నిండలేదు. చిన్నవాడు కాబట్టి ఇలాంటివి వాడికి పూర్తిగా అర్థం కావు. అన్నింటికీ అక్కని అనుసరిస్తాడు. అనుసరిస్తూనే దానితో పోటీ పడతాడు.

పాప ఎంతో ఉత్సాహపడి, "పేస్టుమీద బొమ్మేయించుకుని ఎన్నాళ్లయిందో! ఇన్నాళ్లూ అమ్మ ఒక్కసారి కూడా బొమ్మవెయ్యలేదు" అని శ్రీమతిపై పితూరీ కూడా చెప్పింది.

నేను శ్రీమతిపై కోపం నటిస్తూ, "వాళ్లకి పేస్టుతో బొమ్మలు ఎందుకు వెయ్యలేదు?" అనడిగాను.

"ఎందుకు వెయ్యలేదూ! వేశాను. కానీ మీకులా నమ్మించే విద్య నాకు తెలియదుగా. దాంతో మానేయాల్సి వచ్చింది" అంది శ్రీమతి వెంటనే.

అర్థమైంది. శ్రీమతికి బొమ్మలెయ్యడం రాదు. నాకూ రాదు. ఎటొచ్చీ తనది నిజాయితీ. నాది లౌక్యం.

పిల్లల్ని కొన్ని విషయాల్లో మాయ చెయ్యాలి. నేను పాపని ఏ బొమ్మ కావాలీ అనడిగి – బ్రష్షుమీద పేస్టు వేసేవాణ్ణి. పేస్టు మామూలుగానే వేసినా, అదడిగిన బొమ్మలోని లక్షణాలన్నీ ఉన్నట్లు భ్రమ పెట్టేవాణ్ణి. నేను కాస్త నొక్కించేసరికి అది హిప్నొటైజ్ అయిపోయేది. అది నమ్మితే బాబుని నమ్మించడం ఏమాత్రం కష్టం కాదు. వాణ్ణి నమ్మించే బాధ్యత అదే తీసుకునేది.

"సరేలే, నీకే బొమ్మ కావాలో చెప్పు" అన్నాను పాపతో.

"ఇంతవరకూ నాకు ఒక్కసారి కూడా ఒంటెబొమ్మ వెయ్యలేదు. ఈ వేళ అది కావాలి" అంది పాప.

దాని బ్రష్షుమీద పేస్టు వేశాను. ఒంటెకు మూపురం ఎక్కడుందో, కాళ్లు ఎంత పొడుగున్నాయో వివరించి చెబుతుంటే పాప చాలా ఉత్సాహంగా విని, "పుస్తకాల్లో ఇన్ని ఒంటె బొమ్మలు చూశాను. నాన్నగారు వేసినంత బాగా ఒక్కటీ లేదు" అంది.

అంత ఓవర్ చేసిందంటే, పాపమీద నాకు అనుమానమే. వయసు నాలుగే నిండినా దానిది ఈడుకి మించిన తెలివి. బ్రష్షుమీద పేస్టుకి తానడిగిన బొమ్మ రూపం ఏమాత్రం లేదని, ఏడునెల్ల క్రితం నేను ఇండియా వదిలినప్పుడే అది కనిపెట్టేసిందని నా అనుమానం. కానీ రోజూ బ్రషింగ్ దగ్గర మా ఇద్దరికీ అదో ఆట. అది అడగడం, నేను పేస్టు వేసి అందులో అది అడిగిన బొమ్మ లక్షణాలు చూపించడం – అదంతా దానికో సరదా! నేను దాన్ని మాయలో పడేస్తున్నాననుకుంటే – అదే నన్ను మాయలో పడేస్తుండొచ్చు.

కన్నవారిలో యశోద ఉన్నట్లే – కన్నబిడ్డల్లోనూ కృష్ణులుంటారు. అనురాగబంధంలో అదో మాయ!

అక్క పెద్దది కాబట్టి బ్రషింగుకి అక్కే ముందు వెళ్లాలి – అనే మా లాజిక్కుని బుద్ధిగా అనుసరించి ఊరుకున్నప్పటికీ – అక్కెప్పుడొస్తుందా, తన బ్రష్షుమీద నేను పేస్టెప్పుడు వేస్తానా అని చాలా అసహనంగా ఎదురుచూస్తున్నాడు బాబు.

శ్రీమతి పాపని తీసుకుని రాగానే, "నాన్నగారూ! నాకూ ఒంటె బొమ్మ వెయ్యండి" అన్నాడు బాబు.

పాప వెంటనే వాడివంక ఆరిందాలా చూసి, "నాన్నగారికి బోలెడు బొమ్మలొచ్చు. అస్తమానూ ఒంటె ఒక్కటే అడక్కూడదు. నీకు ఏనుగు బొమ్మ వెయ్యమను" అంది.

బాబు వెంటనే, "నాకు ఒంటే వద్దు. ఏనుగు బొమ్మ కావాలి" అన్నాడు.

"గుడ్ బాయ్" అంది పాప. అక్క పొగిడిందని బాబు తెగ సంబరపడ్డాడు.

నేను వాడి బ్రష్షుమీద పేస్టు వేసి, అందులో ఏనుగు లక్షణాల్ని వివరించి చెబుతున్నాను. బాబే కాదు, పాప కూడా చాలా ఆసక్తికరంగా వింటోంది.

శ్రీమతి నావంకనే చూస్తూ, "అప్పుడప్పుడు నన్ను బాలా అంటుంటారుగా! మీ మాటలతో నన్నెంత మోసగిస్తున్నారోనని అనుమానంగా ఉందిప్పుడు" అని నవ్వింది.

ఆ నవ్వు ఇచ్చిన ధైర్యంతో, "మోసం మధురంగా ఉండాలి కానీ – జీవితంలో మోసపోవడానికి మించిన గొప్ప అనుభూతి ఉండదు – అని కూడా నీకు అనిపించి ఉండాలే" అన్నాను.

అందరికీ బ్రషింగులయ్యేక – "ఈరోజు నేను ఆఫీసుకి వెళ్లడం లేదు. ఐనా ఎనిమిది లోగా కొంత పొట్టపూజ అవసరం. పిల్లలు పదింటిదాకా ఆగలేరు" అనేసి గది బయటికెళ్లి అవసరమైనవన్నీ ఫ్రిజ్‌లోంచి తెచ్చాను. అప్పటికింకా ఒలోముచ్‌కీ నిద్ర లేవలేదు.

నేను బ్రెడ్ ప్యాకెట్ విప్పి స్లైసులు తీశాను. వెన్న ప్యాకెట్ విప్పి చాకుతో వాటికి వెన్న పూశాను. జామ్ బాటిల్ విప్పి జామ్ పుయ్యబోతూ, "ముందు పిల్లలకి ఛీజ్ పెట్టు" అన్నాను.

శీతల దేశంలో వంటికి తగిన వేడిని అందించడంలో ఛీజ్‌ది ముఖ్య పాత్ర అని జర్మన్లు అంటారు. అదేం కర్మో – ఛీజ్ నోట్లో పెడితే చాలు నాలిక వెనక్కి తోసేస్తుంది నాకు. అది విన్న జర్మన్ మిత్రులు – "నువ్వేమిటో, నీ రుచులేమిటో అర్థం కాదు కానీ – నీ పిల్లలొచ్చేక వాళ్లకైనా ఛీజ్ అలవాటు చెయ్యి. అన్ని పోషకపదార్థాలూ అందులో ఉంటాయి" అని చెప్పారు.

పిల్లలకి పోషకపదార్థాలు అందించాలన్న తపన నాకూ ఉంది. అందుకే శ్రీమతికి ఛీజ్ గురించి చెప్పాను.

శ్రీమతి ఛీజ్ ప్యాకెట్ విప్పింది. అందులోంచీ సన్నగా పొడుగ్గా ముచ్చటగా ఉన్న ఛీజ్ ముక్కల్ని తీసి పాపకీ, బాబుకీ చెరొకటీ ఇచ్చింది.

పాప ఛీజ్ నోట్లో పెట్టుకుని వెంటనే, "ఛీ, యాక్" అంటూ వేళ్లతో బయటకు తీసేసింది.

ఒకప్పుడైతే ఉమ్మేసేది. అది తప్పని మందలించి మేమే దానికిలా అలవాటు చేశాం.

పాప ఎప్పుడైతే యాక్ అందో, ఆ వెంటనే బాబు ఛీజ్‌ని నోట్లో పెట్టుకోకుండానే, "యాక్" అన్నాడు. అక్కమీద వాడికంత నమ్మకం.

"వీళ్లకి ఛీజ్ నచ్చినట్లు లేదు" అంది శ్రీమతి.

గుండె గుభీల్మంది. శాకాహారులైన మా పిల్లల వంట్లో పోషకపదార్థాలు ప్రవేశపెట్టడానికి ఛీజ్‌మీద ఎన్నో ఆశలు పెట్టుకున్నాను మరి.

"సరేలే, నెమ్మదిగా అలవాటు చేద్దాం. ఒకసారి అలవాటు పడితే – పిల్లలు ఛీజ్ తప్ప మరేం తినడానికీ ఇష్టపడరుట" అన్నాను.

అప్పటికి కొన్ని బ్రెడ్ స్లైసులు రెడీ అయ్యాయి. ఛీజ్ అనుభవాన్ని బట్టి, ముందు నేను తిని రుచికి పరవశాన్ని నటించి అప్పుడు పిల్లలకి పెట్టాలనుకుని, ముందు రెండు స్లైసులు తిని – "ఇప్పుడు మీరు" అన్నాను పిల్లలతో.

"ఈరోజు మీకు కొత్త రకం ఫలహారం" అంటూ శ్రీమతి వాళ్లకి తలో రెండు స్లైసులూ అందించింది.

వాళ్లవి తీసుకుని గదిలో ఓ మూలకి పరుగెత్తారు. ముందు నేను తిని పరవశించానుగా – వాటి రుచిపై వాళ్లకి అనుమానం లేదు.

"అబ్బా, వసూ! దీన్ని ఫలహారమనకు" అభ్యంతరపెట్టాను.

"తినడానికి లేని అడ్డు ఫలహారమనడం దగ్గరొచ్చిందా? ఐనా ఇందాకా మీరూ అన్నారు ఫలహారమని, మర్చిపోయారా?" అంది శ్రీమతి.

"గుర్తు చేసుకో – నేను ఫలహారమనలేదు, అల్పాహారమన్నాను. అంటే మనుషుల్లో అల్పుల్లా, ఇది ఆహారంలో అల్పమైనదన్నమాట!"

"రెండింటికీ తేడా ఏమిటిట?"

"ఫలహారమంటే ఎంజాయ్ చేస్తూ తినేది. అల్పాహారమంటే గతి లేక తినేది"

"అంటే జర్మనీ వచ్చేక తిండి విషయంలో మీరు గతి లేని వాళ్లయ్యారన్నమాట! నేనొచ్చేక కూడా అలాగే ఉంటానంటే కుదరదు. మీకు రోజుకో కొత్త ఫలహారం చేసి పెడతాన్లెండి" అంది శ్రీమతి.

"నో వసూ! ఇక్కడ మనకిదే వీలుగా ఉంటుంది. నాక్కూడా బ్రెడ్డూ జాముని తినడం దాకా ఓకే. అది ఫలహారమంటేనే ఏదోలా ఉంటుంది" అన్నాను.

మాట్లాడుతూనే ఉన్నాం – ఆమె తను కూడా బ్రెడ్ స్లైసులు సిద్ధం చేస్తోంది. మధ్యలో పిల్లలొచ్చి బ్రెడ్ స్లైసులు అడిగారు. వాళ్లకి జామ్‌కంటే ఎక్కువగా వెన్న నచ్చింది. నాకెంతో సంతోషమైంది.

"నువ్వు కూడా వెన్న ఎక్కువ రాసుకో. చలికి బాగా తట్టుకోగల్గుతావు" అన్నాను ఆమెతో.

"అమ్మో, నాకు వెన్న వద్దు. ఇప్పుడిప్పుడే వళ్లు రావడం మొదలైంది నాకు" అంది శ్రీమతి చటుక్కున.

ఆ విషయమై తర్వాత నచ్చజెప్పొచ్చులే అనుకుని అప్పటికి నొక్కించలేదు.

"ఈరోజు మన ప్రోగ్రాం ఏమిటి?" అంది శ్రీమతి అల్పాహారం, పాలు సేవించేక.

"మిమ్మల్ని తీసుకుని పోలీసు స్టేషనుకి వెళ్లాలి" అన్నాను.

"అన్‌మెల్డుంగ్ (రిజిస్ట్రేషన్)కా?" అంది శ్రీమతి వెంటనే.

తనకి విషయమే కాదు, జర్మన్ పేరు కూడా బాగానే గుర్తుంది.

అన్‌మెల్డుంగ్ నా తక్షణ కర్తవ్యం. ఎందుకంటే – శ్రీమతి, పిల్లలు నాతో ఉన్నందుకు అదనంగా అలవెన్సు వస్తుంది. భార్యకి 200 మార్కులు, పిల్లలిద్దరికీ చెరో యాభై మార్కులు. వాళ్లు ఈ నెలలో పదవ తేదీ లోపునే ఇక్కడికొచ్చారు కాబట్టి ఈ నెలనుంచే నాకీ అలవెన్సు మొదలౌతుంది. అందుకుగానూ బెర్లిన్ నగరంలో పోలీస్ స్టేషన్లో అన్‌మెల్డుంగ్ పూర్తి చేసి ఆ రసీదులు, బాన్ నగరంలో ఉన్న డాడ్ ఆఫీసుకి పంపాలి. ఆ పని వెంటనే చెయ్యాలి. డబ్బుతో పని కదా!

బయటకు వెళ్లాలంటే – ఇండియాలోలా ఆదరాబాదరాగా డ్రస్ చేసుకుని వెళ్లడానికి కుదరదు. పైన స్వెటర్ వేసుకోవాలి. కాళ్లకి సాక్సు, బూట్లు తొడగాలి. మంకీ కాప్ పెట్టుకోవాలి. చేతులకి గ్లోవ్స్ వేసుకోవాలి. ఇక ఓవర్‌కోట్ తప్పనిసరి. మాకు మేమే కాక, పిల్లలకి కూడా ఇవన్నీ చెయ్యాలంటే – బయటికెళ్లడంకంటే ఇంట్లో ఉండడమే బాగుందనిపిస్తుంది.

అప్పటికి నేను బెర్లిన్ వచ్చి మూడు నెలలు దాటింది కాబట్టి – నావరకూ డ్రెస్సింగ్ ఓకే. ఇండియాలో ఏవో కుట్టించింది కాబట్టి పిల్లలకి కూడా ఫరవాలేదు. వచ్చిన సమస్యల్లా శ్రీమతి గురించే.

ఆ రోజు చలి ఎక్కువగా ఉంది. ఆపైన ఈదురుగాలి. శ్రీమతికింకా మాంటెల్ (ఓవర్‌కోట్) లేదు. ఆమె స్వెటర్ ధరించి పైన షాల్ కప్పుకుంది. జర్మనీలో శీతలానికి ఆ ఏర్పాటు అక్కడి చలికి సరిపోదు.

అమ్మా నాన్నా పక్కనుంటే పిల్లలకి ఏ వాతావరణం కొత్తగా అనిపించదు. కాబట్టి వాళ్లు మామూలుగానే ఉన్నారు.

మా ఇంటినుంచి నడచి వెడితే రెండుమూడు నిముషాల్లో వస్తుంది 'డాయిచే ఓపర్' పేరిట ఊ–బాన్‌హోఫ్ (అండర్‌గ్రౌండ్ రైల్వేస్టేషన్). నేలమీంచి కిందకి మెట్లు దిగి – నేలకింద నడిచే – రైలెక్కడం మావాళ్ళకి కొత్త. అన్నీ వింతగా చూస్తున్నారు వాళ్లు.

నాకైతే పాస్ ఉంది. ఎన్నిమార్లెక్కినా ఊబాన్ ఫ్రీ. ఆరేళ్లలోపు పిల్లలకి కూడా ఊబాన్ ఫ్రీ. ఇక టికెట్ కొనవలసింది శ్రీమతికి మాత్రమే.

ఎంత దూరానికైనా రెండు నిముషాల్లో చేర్చగల ఊబాన్‌లో మేము మా ఏరియా పోలీస్ స్టేషన్‌కి వెళ్లాం. అక్కడ ఏయే కాగితాలు చూపాలో సరిగ్గా తెలియక, మొత్తం మూడుసార్లు వెళ్లి రావాల్సొచ్చింది. మూడోసారి వెళ్లినప్పుడు అన్‌మెల్డుంగ్ క్షణాలమీద ఐపోయింది. రసీదులు తీసుకున్నాను. ముందుగా సిద్ధం చేసుకున్న కవర్లో ఆ రసీదుల్ని పెట్టి వెంటనే డాడ్ ఆఫీసుకి పోస్టు చేశాను.

అక్కడి ప్రయాణ సౌకర్యాలు, ఆఫీసు వ్యవహారం ఎలాంటివంటే – ఇదంతా జరిగి ఇంటిముఖం పట్టేసరికి ఇంకా పదకొండు కాలేదు.

పాపం పసివాడు బాబు – వాడు ఎక్కువగా నిద్రపోతున్నాడు. నేను వాణ్ణి ఎత్తుకుంటే పాప కళ్లలో అసూయ.

"నాన్నగారు దగ్గర లేరుగా. నిన్ను ఎత్తుకోమననులే" అనేదిట ఇండియాలో శ్రీమతితో. అది నామీద పెట్టుకున్న నమ్మకం. అది నిజం చెయ్యాలి.

బాబుని శ్రీమతి ఎత్తుకోవచ్చు కానీ, ఆమె చేతులు షాల్‌ని సవరించుకుందుకే సరిపోతున్నాయి. షాల్ సవరించుకోకపోతే చలి పులిలా తినేస్తుంది. అందుకని నిన్న రాత్రికి లాగే అప్పుడూ పిల్లలిద్దర్నీ ఎత్తుకున్నాను.

శ్రీమతి నొచ్చుకుంది. ఎలాగో అలా బాబుని ఎత్తుకుంటానంది.

"మీరు నా పక్కనున్నారుగా. నా బలం పెరిగిపోయింది. నీకు పరీక్షించాలనుంటే, వీళ్లతోపాటు నిన్ను కూడా ఎత్తుకోగలను" అన్నాను.

శ్రీమతి సిగ్గుపడింది. "పిల్ల పెద్దదౌతోంది. దానిముందు అలా మాట్లాడకండి" అంది.

ఆడవాళ్లు సిగ్గుని ప్రదర్శించే తీరు విచిత్రంగా ఉంటుంది. అమ్మాయికి నాలుగు నిండి ఇంకా నాలుగు నెలలు కాలేదు. తన సిగ్గుని ప్రదర్శించడానికి దానికి పెద్దరికాన్ని అంటగట్టింది శ్రీమతి.

"అది పెద్దదైతే అయింది కానీ, నువ్వు మాత్రం దానిముందు అలాగనకు. నేనేదో తప్పు మాట్లాడేననుకోగలదు" అని కవర్ చేసుకున్నాను.

ఇల్లు చేరేసరికి – బుధవారం కదా – మా భవంతిముందు సంత హడావుడి.

కూరలు తెచ్చుకోవాలి. నాకైతే శ్రీమతితో కలిసి సంత చెయ్యాలనుంది కానీ బాబు గాఢనిద్రలో ఉన్నాడు. అందుకని అంతా భవంతి లోపలికెళ్లాం.

శ్రీమతికి ఇంటి తాళం తియ్యడంలో సులువులు చెప్పేను. తనచేతనే తాళం తీయించాను. లోపలికెళ్లేక ఇంట్లో బాబుకి తోడుగా శ్రీమతిని వదిలి పాపని తీసుకుని బయటికెళ్లాను.

దాన్నీ ఇంట్లో వదిలేద్దును కానీ అది నన్ను వదలడం లేదు.

మేమిద్దరం సంతలో కూరల దుకాణానికి వెళ్లాం. అక్కడి జనంలో చాలామంది పాపని చూసి బాగా ముచ్చట పడ్డారు. కూరలమ్మే ఒకామె దానికి ఓ చాక్‌లెట్, ఆపిల్ ఇచ్చింది. పాప తీసుకోలేదు. నావంక చూసింది.

"తీసుకోదేం?" అనడిగింది కూరలామె ఆశ్చర్యంగా.

"నా అనుమతి లేకుండా ఎవరేమిచ్చినా ఏం తీసుకోదు" అని చెప్పాను. అంతే – ఆమె వెంటనే చేతులు సాచి దాన్ని దగ్గరగా తీసుకుని గట్టిగా హత్తుకుంది. ఆ వెంటనే ఎత్తుకుని ముద్దాడింది.

నేను చెప్పేక ఆమె ఇచ్చినవి తీసుకుంది పాప.

సంతలో కూరలు కొని, ఇల్లు చేరాక పాప చాలా ఉత్సాహంగా, “అమ్మా! జర్మనీవాళ్లు చాలా మంచివాళ్లు. కొట్టుకు వెళ్లిన నాలాంటి చిన్నపిల్లలకి చాక్లెట్సూ, ఆపిల్సూ ఇస్తారు” అని తల్లికి చెప్పుకుంది.

నీ అనుభవమెంతని దాన్ని తీసిపారేయొచ్చు. కానీ ఇండియాలో అంతవరకూ కూరల మార్కెట్లో దానికిలాంటి అనుభవం లేదన్నది నిజం.

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments